వంతెన నిర్మాణానికి వీడని గ్రహణం

గోస్తని నదిపై వంతెన నిర్మాణానికి గ్రహణం వీడటం లేదు. ముందుగా అనుకున్న బడ్జెట్ సరిపోకపోవడం.. ఆదిలోనే హంస పాదు అన్నట్లు పనులు మొదలుపెట్టాక నీటిని నిలుపుదల చేసే మట్టికట్ట వరదలకు కొట్టుకుపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది పరిస్థితి. మూడున్నరేళ్లలో అంచనా వ్యయం మరింత పెరిగిపోవడంతో వంతెన నిర్మాణం ఎప్పటికి సాకారమవుతుందా అని పంచాయతీ వాసులు నిరీక్షిస్తున్నారు.

గోస్తని నదిపై టి.నగరపాలెం వద్ద ప్రతిపాదన

- మట్టికట్ట కొట్టుకుపోవడంతో ముందుకు సాగని పనులు
- మూడున్నరేళ్లలో పెరిగిన నిర్మాణ వ్యయం
- నదిని దాటేందుకు ప్రజల అవస్థలు



తగరపువలస: భీమిలి మండలంలోని టి.నగరపాలెం పంచాయతీ నుంచి గోస్తని నదిని దాటడానికి నిర్మించ తలపెట్టిన వంతెన పనులు ముందుకు సాగడం లేదు. వంతెన పూర్తయితే నదికి అవతలి వైపు ఎల్లారమ్మ మెట్ట వరకు చేరుకోవచ్చన్న పంచాయతీ వాసుల ఆశ నెరవేరడం లేదు.

మూడున్నరేళ్ల క్రితం శ్రీకారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మూడున్నరేళ్ల క్రితం రూ.2.98 కోట్లతో వంతెన నిర్మాణానికి దివీస్ లేబొరేటరీ ముందుకు వచ్చింది. నిర్మాణంలో భాగంగా దివీస్ తన సీఎస్ఆర్ నిధులను 15 శాతం మొత్తాన్ని ప్రభుత్వానికి జమ చేసింది. కానీ ఈ మొత్తం సరిపోవడం లేదని కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో నిర్మాణ వ్యయాన్ని పెంచి వంతెన నిర్మాణాన్ని కూడా సవరించారు. ఇందులో భాగంగా ఎల్లారమ్మ మెట్ట వరకు వంతెనతో పాటు మెట్ట మీదుగా తగరపువలస జాతీయరహదారి వరకు రోడ్డు నిర్మాణాన్ని కూడా చేర్చారు. దీంతో తరువాత వచ్చిన కాంట్రాక్టర్ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

వర్షాకాలంలో చాలా కష్టం

టి.నగరపాలెం పంచాయతీ గోస్తని నదికి ఆనుకుని ఉండటంతో వరదలు వచ్చిన ప్రతిసారీ ఇక్కడ తీరం కొంతమేర కోతకు గురవుతుంది. ఆ సమయంలో బీటీ రోడ్డు మీదుగా కూడా తగరపువలస వైపు వచ్చే అవకాశాలు తగ్గిపోతుంటాయి. సాధారణ రోజుల్లో ఈ బీటీ రోడ్డు మీదుగా వాహనాలపై ప్రయాణించినా జాతీయరహదారి పై నుంచి ఎడమవైపుకు బదులుగా కుడి వైపు నుంచి రాంగ్‌రూట్లో ప్రయాణించవలసి ఉంటుంది. అదే నదిపై వంతెన నిర్మాణం పూర్తయితే నేరుగా తగరపువలస పట్టణ ప్రాంతంలోకి నడిచి, వాహనాల ద్వారా చేరుకోవచ్చు. దూరం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది. ముఖ్యంగా నడిచి తగరపువలస చేరుకునే వ్యవసాయ కూలీలు, రైతులు, చిరు వ్యాపారులు, విద్యార్థులకు సులభంగా ఉంటుంది. ఈ ప్రాంత ప్రజల ముంపు కష్టాలు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, దివీస్ లేబరేటరీ వంతెన నిర్మాణానికి పునరాలోచన చేయాలని టి.నగరపాలెం ప్రజలు కోరుతున్నారు.

వరదలకు కొట్టుకుపోయిన మట్టికట్ట

వంతెన నిర్మాణానికి ముందు నదిలో నీటిని నిలుపుదల చేస్తూ కాంట్రాక్టర్ నిర్మించిన మట్టికట్ట వరదలకు కొట్టుకుపోయింది. ఎగువ నుంచి వచ్చే వరదనీరు దిగువకు వెళ్లిపోయేందుకు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి పైపులు సరిపడినన్ని వేయలేదని అప్పట్లో విమర్శలు వినిపించాయి. ఈ మూడున్నరేళ్లలో పెరిగిన ధరల కారణంగా ఇప్పట్లో వంతెన నిర్మిస్తే రూ.7.78 కోట్లకు చేరుకోనున్నట్టు అంచనా వేశారు. గోస్తని నదిపై వంతెనల నిర్మాణానికి తాటితూరు, పద్మనాభం మండలం పాండ్రంగిలోనూ భూమి పూజలు జరిగాయి. ప్రస్తుతం ఈ రెండు చోట్ల వంతెనల నిర్మాణాలు జరుగుతున్నాయి. కానీ వాటికంటే ముందే మొదలు పెట్టిన టి.నగరపాలెం వంతెన నిర్మాణం మాత్రం ఇంచ్ కూడా కదలడం లేదు.


గతంలో వంతెన నిర్మించేందుకు మట్టికట్టలు వేసిన ప్రాంతం

ఇసుక తవ్వకాలతో ప్రమాదకరంగా నది


గతంలో రాత్రయినా, పగలైనా నదిని దాటుకుంటూ తేలికగా తగరపువలస వెళ్లిపోయేవాళ్లం. ఆకుకూరలు, కూరగాయలు తరలించడానికి పడవలు కూడా ఉండేవి. నదిలో ఇసుక తవ్వకాల కారణంగా ప్రస్తుతం 12 నుంచి 20 అడుగుల గోతులు ఉన్నాయి. ఈ పరిస్థితులలో నదిని దాటడం ప్రాణాంతకమే. – **కుప్ప నాగరాజు**, టి.నగరపాలెం

వంతెన పూర్తయితే ఎంతో సౌకర్యం


టి.నగరపాలెం నుంచి అవతలి ఎల్లారమ్మ మెట్టకు ప్రతిపాదించిన వంతెన పూర్తయితే మాకు సౌకర్యంగా ఉంటుంది. ఎందుకంటే ఈ మెట్టపై ఉన్న ఎల్లారమ్మ తగరపువలస, టి.నగరపాలెం గ్రామ పంచాయతీలకు ఉమ్మడిగా గ్రామదేవత. మంగళ, శుక్రవారాలలో వందల మంది నది చుట్టూ తిరిగి ఆలయానికి చేరుకోవలసి వస్తుంది. – **పొట్నూరు అచ్యుతరావు**, టి.నగరపాలెం

శివారు గ్రామాల ప్రజలకు అవస్థలు


టి.నగరపాలెం పంచాయతీలో శివారున ఉండే గొల్లలపాలెం, ఎస్సీ కాలనీల ప్రజలకు నదిలో నుంచి అడ్డంగా వెళ్లే దారే దగ్గర. లేదంటే అవంతి కళాశాల లేదా మహరాజుపేట వరకు ప్రయాణించి తగరపువలస చేరుకోవడం దూరమవుతుంది. వంతెన పూర్తయితే మా పక్కనే ఉన్న తాటితూరు, మజ్జివలస పంచాయతీల ప్రజలకు కూడా ఉపయోగం. –**పల్లా శ్రీనివాసరావు**, టి.నగరపాలెం

ఆటోల్లో చుట్టూ తిరిగి వెళ్తున్నాం


పూర్వం తాటితూరు, టి.నగరపాలెం పంచాయతీలకు చెందిన జ్యూట్ కార్మికులు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు నది ఇసుకలో నుంచి నడుచుకుంటూ తగరపువలస వచ్చేవారు, నదిలో నీరు ఉన్నా దాటడానికి ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు ఎక్కడ నదిలో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియదు. అందుకే కష్టమో, నష్టమో ఆటోల ద్వారా చుట్టూ తిరిగి తగరపువలస వెళ్తున్నాం. –**తమ్మిన పురుషోత్తమరావు**, టి.నగరపాలెం

క్లుప్తంగా

ఘనంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట


అమ్మవారిని దర్శించుకుంటున్న రెండోవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు నమ్మివానిపేటలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ ఏర్పాటు చేసిన కోలాటం, బాణసంచా, డీజే వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారిని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. రెండోవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, డబ్బీరు ప్రశాంతి, దల్లి అప్పలరెడ్డి, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నమ్మి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాన్ బహూకరణ


నిర్వాహకురాలికి ఫ్యాన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు చిల్లపేట అంగన్‌వాడీ కేంద్రానికి పరదేశిపాలెం గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బోర అప్పలరెడ్డి, వాసంతి దంపతులు గురువారం సీలింగ్ ఫ్యాన్ బహూకరించారు. ఫ్యాన్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు జీరు వెంకటరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి నిర్వాహకురాలు సరస్వతికి అందజేశారు.

అనాథ బాలలకు పుస్తకాల వితరణ


బాలలకు పుస్తకాలు అందిస్తున్న దాతలు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస లిటిల్ హగ్ భరోసా అనాథాశ్రమంలో 20 మంది చిన్నారులకు సంవత్సరానికి సరిపడా రూ.80వేల విలువైన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌ను నగరానికి చెందిన వైద్యుడు గురువారం అందించారు. తన తండ్రి లక్ష్మణ్ కేశవ్ శాస్త్రీ రెండో వర్థంతి సందర్భంగా రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు ఈ పుస్తకాలు అందించినట్టు తెలిపారు. నగరానికి చెందిన వైద్యుడు నాని, పాఠశాల చైర్మన్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్‌కుమార్, అనాథాశ్రమం ఇన్‌చార్జి వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులకు శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

మధురవాడ: కొమ్మాది జంక్షన్ నుంచి పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వరకు రూ.74.50లక్షలతో హైవేకు ఇరువైపులా ఉన్న కాల్వల్లో పూడికతీత పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. మధురవాడ కోఆపరేటివ్ సొసైటీ భవనం ఆవరణలో శిలాఫలకం ఆవిష్కరించారు. జీవీఎంసీ 5, 6, 7 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాలకు దీనివల్ల ప్రయోజనం చేకూరుతుందన్నారు. జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, జెడ్పీ కనక మహాలక్ష్మి, ఈఈ శాంతిరాజు, కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్లా మంగమ్మ, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ భీమిలి ఇన్‌చార్జిగా సవరవిల్లి


తగరపువలస/భీమిలి: కాంగ్రెస్ పార్టీ భీమిలి ఇన్‌చార్జిగా సవరవిల్లి రామకృష్ణ నియమితులయ్యారు. ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ నీళ్లకుండీలకు చెందిన రామకృష్ణకు ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా భీమిలి బ్యాంక్ కాలనీ వద్ద పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నాయకుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ముగిసిన ఇంగ్లిష్ శిక్షణ తరగతులు


మోహనరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు, కొండపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంటాన మోహనరావు నిర్వహిస్తున్న ఇంగ్లిష్ శిక్షణ తరగతులు ముగిశాయి. మే 1 నుంచి 36 రోజుల పాటు ఫంక్షనల్ లాంగ్వేజ్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వడంతో భీమిలి మండలం కొత్త మూలకుద్దు గ్రామస్తులు, విద్యార్థులు గురువారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. మాస్టారి శిక్షణలో తామంతా ఇంగ్లిష్ మాట్లాడటంలో మెలకువలు నేర్చుకున్నామని, ఇప్పుడు పోటీ పరీక్షలలో భయం లేకుండా పాల్గొంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంగ్లిష్‌లో ధారాళంగా మాట్లాడేందుకు మాస్టారు నాలుగు దశాబ్దాలుగా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడానికి ఇలాంటి శిక్షణ శిబిరాలు దోహదపడతాయన్నారు.

మధురవాడలో భారీ వర్షం


మధురవాడ డైలీ మార్కెట్ వద్ద వర్షం ఆగిన గంట తర్వాత కూడా రోడ్లపై నిలిచిన నీరు


మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద వర్షం ఆగిన తర్వాత కూడా తొలగని నీటిలో తప్పని ప్రయాణం

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాలలో గురువారం సాయంత్రం గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలతో పాటు హైవే సర్వీసు రోడ్డు, దానిని ఆనుకుని ఉన్న పలుప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొమాది జంక్షన్ మధురవాడ బస్టాప్ ఏరియా, మధురవాడ డైలీ మార్కెట్, అప్ బ్రిడ్జి, చంద్రంపాలెం, వుడా కాలనీ–హైవే జంక్షన్, పీఎం పాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు, రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లు కాల్వలు ఏకమవడంతో మురుగులో ప్రయాణించలేక ప్రజలు అవస్థలు అవస్థలు పడ్డారు.


పీఎం పాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులో వర్షం నీటిలో వాహన చోదకుల అవస్థలు

ఘనంగా ఆలయ శిఖర ప్రతిష్ట ఉత్సవాలు


పూర్ణ కలశాన్ని ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో పునర్నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ట ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం మండపారాధన, పారాయణం, హనుమాన్ మహాయాగం, మహా మంత్ర పుష్పార్చన వంటి పూజలు చేపట్టి, గురువారం ఆలయంపై శిఖరాన్ని ప్రతిష్ఠించారు. పద్మనాభం గ్రామంలోని కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పూర్ణ కలశాన్ని అభయాంజనేయ స్వామి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయంపై శిఖరాన్ని ప్రతిష్ఠించారు. మహిళలు తీసుకువచ్చిన బూరెలను కలశంపై నుంచి వేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

జాతీయ స్థాయి ప్రమాణాలతో పిల్లలకు విద్య


మధురవాడలో ఎస్‌జే ప్లే స్కూల్‌ను ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

మధురవాడ: జాతీయ స్థాయి ప్రమాణాలతో పిల్లలకు విద్యను అందించేందుకు ప్లే స్కూల్ ప్రారంభించడం అభినందనీయమని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అన్నారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ వెనుక గల మధురవాడ జేఆర్ నగర్‌లో ఎస్‌జే ప్లే స్కూల్‌ను గురువారం ప్రారంభించారు. సంస్థ చైర్మన్ పోతిన శివలింగేశ్వరరావు మాట్లాడుతూ తమ తండ్రి జగన్నాథం ఆశయాలకు అనుగుణంగా ఈ పాఠశాల ప్రారంభించినట్టు చెప్పారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ నారాయణపాత్రుడు రిబ్బన్ కట్ చేసి, ప్రారంభించారు. స్కూల్ కో–ఆర్డినేటర్ మీనాకుమారి, జగదీష్ మాట్లాడుతూ ఇండియాలో 3వేలకు పైగా బ్రాంచ్‌లు గల క్రీడో విద్యాసంస్థ స్టాండర్డ్స్‌తో దీనిని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దొరబాబు, కొయ్య ప్రసాదరెడ్డి, పోతిన హనుమంతురావు, రవీంద్ర భారతి రీజనల్ కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

15న భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ

మధురవాడ: భవన నిర్మాణ కార్మిక సంఘం విశాఖ జిల్లా మహా సభలను ఈ నెల 15వ తేదీన మధురవాడలో నిర్వహించనున్నట్లు సంఘం మధురవాడ జోన్ ప్రధాన కార్యదర్శి పేడాడ రాజశేఖర్ తెలిపారు. కొమ్మాది జంక్షన్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలన్నారు. జిల్లా నాయకుడు పి.రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

- ప్లాస్టిక్‌ను తరిమికొడదాం
- పిలుపునిచ్చిన అధికారులు
- మొక్కలు నాటిన ఉద్యోగులు, స్వచ్ఛంద సేవకులు
- వాడవాడలా పర్యావరణ దినోత్సవం


టి.నగరపాలెంలో మొక్కలు నాటుతున్న పొట్నూరు చంద్రశేఖర్ తదితరులు


మొక్క నాటుతున్న జడ్జి సౌజన్య


అన్నవరంలో మొక్కలు నాటుతున్న దివీస్ ఉద్యోగులు


లొడగలవానిపాలెంలో మొక్క నాటుతున్న ప్రత్యేక అధికారి సత్తిబాబు, ఎంపీడీవో జానకి


తర్లువాడలో మొక్కలు నాటుతున్న వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు

తగరపువలస: పర్యావరణ పరిరక్షణకు అందరం పాటుపడదామని ఆనందపురం మండల ప్రత్యేక అధికారి సత్తిబాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలో గురువారం 4179 మొక్కలు నాటినట్టు తెలిపారు. ఎస్వో, ఎంపీడీవో జానకి తదితరులు తర్లువాడ పంచాయతీ బీసీ కాలనీ, లొడగలవానిపాలెం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు పాల్గొన్నారు.

- వెల్లంకిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, డిప్యూటీ ఎంపీడీవో భూపతి సత్యనారాయణ మొక్కలు నాటారు.
- వేములవలసలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.
- టి.నగరపాలెం పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు చంద్రశేఖర్, రాము, చిట్టిబాబు మొక్కలు నాటారు.
- చిప్పాడ దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో ఎర్రయ్యపాలెం బీచ్‌ను శుభ్రం చేసి పాలిథిన్ ఏరివేత చేపట్టారు. అనంతరం 2వేల మంది ఉద్యోగులతో తూడెం రోడ్డు వరకు 2వేల మొక్కలు నాటించారు. దివీస్ డైరెక్టర్లు ఎస్.దేవేంద్రరావు, ఎల్.వి.రమణ, జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, బాలాజీ, రామకృష్ణ, కె.సుబ్బారావు, సీనియర్ మేనేజర్ ప్రసాద్, సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.
- **పీఎం పాలెం:** జాతర వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. వుడా కాలనీ రోడ్డులో మొక్కలు నాటారు.

పద్మనాభుని పుష్కరిణి గట్టుపై ..

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లోని అనంత పద్మనాభ స్వామి పుష్కరిణి గట్టుపై ఎంపీపీ కంటుబోతు రాంబాబు మొక్కలు నాటారు. ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, పాల్గొన్నారు. పాండ్రంగిలో వార్డు మెంబర్ మహంతి అప్పల రమణ మొక్కలు నాటారు.

- రేవిడి, వెంకటాపురం, పద్మనాభం గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్, కుటుంబ బలోపేత కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించారు.

బీచ్‌లో చెత్త సేకరణ

భీమునిపట్నం: భీమిలిలో వైఎంసీఏ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీ అప్పలనాయుడు, విశాఖ వైఎంసీఏ సబ్ రీజనల్ వైస్ చైర్మన్ కె.ఎస్.ఎం.సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.

- ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఆధ్వర్యంలో పిల్లలు మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. మదర్స్ అన్ని షాపుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నిలిపివేయాలని అవగాహన కల్పించారు.

జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో..

భీమిలిలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ డి.సౌజన్య మొక్కలు నాటారు. న్యాయవాద సంఘ ప్రధాన కార్యదర్శి కె.మంజుల, సంయుక్త కార్యదర్శి డి.కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

5వ వార్డులో ర్యాలీ

మధురవాడ: 5వ వార్డులో పర్యావరణ పరిరక్షణ ర్యాలీని కార్పొరేటర్ మొల్లి హేమలత ప్రారంభించారు. జెడ్పీ కనకమహాలక్ష్మి, వైద్యాధికారి కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర రవి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

కొమ్మాది: ప్లాస్టిక్‌ను వినియోగించడం వలన పర్యావరణానికి హాని కలుగుతుందని గీతం వీసీ డా. ఎరోల్ డిసౌజా అన్నారు. గీతంలో గురువారం మొక్కలు నాటారు.ఎండాడలో ఏఎంవోహెచ్ ఎన్. కిషోర్ మొక్కలు నాటారు. చెట్టిపల్లి గోపీ పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ హేమలత, జెడ్పీ


బీచ్ వద్ద సేకరించిన చెత్తతో వైఎంసీఏ సభ్యులు


ర్యాలీలో పాల్గొన్న జాతర వాకర్స్ అసోసియేషన్ సభ్యులు


అనంతుని పుష్కరిణి గట్టుపై మొక్క నాటుతున్న ఎంపీపీ రాంబాబు


మొక్కలు నాటుతున్న ఏఎంవోహెచ్ కిశోర్

బోరు ప్లాట్‌ఫాం నిర్మాణం అడ్డగించిన వారిపై ఫిర్యాదు

పద్మనాభం: మండలంలోని పాత కొవ్వాడలో బోరు బావి ప్లాట్‌ఫాం నిర్మాణాన్ని అడ్డగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి, బీజేపీ నాయకులు గురువారం ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. మాజీ ఎంపీ జీవీఎల్ నర్సింహరావు ఎంపీ నిధుల నుంచి మంజూరు చేసిన రూ.1.20లక్షలతో తమటపు వారి వీధిలో రెండు నెలల క్రితం బోరు బావి నిర్మాణానికి డ్రిల్లింగ్ చేశారని తెలిపారు. ఈ బోరు బావికి ప్లాట్ ఫాం నిర్మాణ పనులు చేపట్టడానికి సిరికి త్రిమూర్తులు, మరి కొంతమంది అడ్డగిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

భీమునిపట్నం: భీమిలిలో గురువారం వినియోగదారుల సంక్షేమ సేవా సంఘం ఏర్పాటు జరిగింది. గౌరవ అధ్యక్షునిగా టి.భీమారావు, అధ్యక్షునిగా కె.ఎస్.నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మైలపల్లి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్ వర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, కోశాధికారిగా పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, సలహాదారులుగా ఎం.ఆనందరావు, బొట్టా సూరిబాబు, న్యాయ సలహాదారునిగా ముమ్మిడిశెట్టి సునీల్, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు.